www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 44 | 16-08-2021 | పుటలు : 4


# స్వాతంత్ర్య స్ఫూర్తితో మరింత అభివృద్ధి సాధిద్దాం...

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు-నన్నయలో ఘనంగా 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు


**15.08.21 (మీడియాసెల్)** స్వాతంత్ర్య స్ఫూర్తితో సమిష్టిగా దేశాభివృద్ధికి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడదామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదివారం విశ్వ విద్యాలయంలో 75 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ముఖ్యఅతిథిగా ఆచార్య మొక్క జగన్నాథరావు హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో సమస్యలను అధిగమిచి దేశం అభివృద్ధి దిశగా పయని స్తుందన్నారు. ఈ ఏడాది ఒలింపిక్స్ లో భారతదేశం విజయ పతాకాన్ని ఎగురవేసిందని, స్వర్ణ పతకాన్ని సాధించామన్నారు. నీరజ్ చోప్రా, మీరాభాయి చాను, రవికుమార్ దహియా, భజరంగ్ పూనియా, లవ్లీనా బోర్గోహైన్, పీ.వీ. సింధు వంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ క్రీడాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎనిమిది కోట్ల రూపాయలకు పైగా నిధులు కేటాయించిందని చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాలోని యువత క్రీడా స్ఫూర్తితో దేశానికి, విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. యూనివర్సిటీకి ఈ ఏడాది ఐ.ఎస్.ఓ, ఎ.ఐ.సి.టి.ఇ సాధించామని, త్వరలో నాక్ గుర్తింపు సాధిద్దామన్నారు. విశ్వవిద్యాలయ గురువులు తమ బాధ్యతలను త్రికరణశుద్ధిగా నిర్వహించి దేశానికి ఉత్తమ పౌరులను అందించాలని తెలిపారు. విశ్వవిద్యాలయాన్ని విద్య, విజ్ఞానం, సాంకేతిక ప్రగతి, పరిశోధనలు, వసతుల కల్పనలతో అభివృద్ధి చేసేందుకు సమిష్టిగా కృషి చేద్దామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కాకినాడ క్యాంపస్‌లో డా.ఎం.కమలకుమారి, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో ఆచార్య కె.శ్రీరమేష్ జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.








## సంపాదకీయం




# ఒక్కడు

ఒక్కడు...అతడు.... అన్న వెంటనే ఏ సినిమా స్టారో గుర్తుకొస్తాడు. ఇప్పుడు సినిమా గురించి కాదు.' వందేళ్లకు ఒక్కడు ' గురించి. వందేళ్లకు పైగా నిరీక్షించిన విజయం గురించి.

ఇంకో వందేళ్లు చెప్పుకునే ఘనత గురించి. ఈ చరిత్రకు ఆద్యుడు, అనితరసాధ్యుడు.. అతడే నీరజ్ చోప్రా!

ఒలింపిక్స్ లో భారత్ కు వచ్చిన తొలి స్వర్ణం! నూట ఇరవై ఏళ్ళ భారత ఒలింపిక్ చరిత్రలో అథ్లెటిక్స్‌లో దక్కిన మొదటి పతకం! జావెలిన్ త్రో క్రీడ గురించి టీవీ చూసే చాలామంది భారతీయులకు తెలియకపోవచ్చు కానీ అందరి ఆకాంక్ష ఒక్కటే... ఆ కుర్రోడు గెలవాలని, ఈ దేశం మురిసిపోవాలని! తొలి ప్రయత్నంలో అతడు విసిరిన దూరం 87.03 మీటర్లు. తక్కిన వాళ్ళు ఎవరు ఆ సమీపంలో లేరు. రెండో ప్రయత్నంలో ఏకంగా 87.68 మీటర్లు విసిరేశాడు. భారత్ పసిడి ఆశలకు రెక్కలొచ్చాయి. దేశ ప్రజల కళ్లల్లో స్వర్ణ కాంతులు కనిపించాయి. ఇది మామూలు విజయం కాదు. వందకోట్ల జనాభా దాటిన దేశంలో వందేళ్ల నిరీక్షణకు తెరదించిన చిరస్మరణీయమైన విజయం. విశ్వక్రీడా యవనికపై స్వర్ణ సంతకం!

పదమూడేళ్ల వయసులో బరువు తగ్గడం కోసం ఈటెను పట్టుకున్న చేతులే ఇప్పుడు పసిడిని మెడలో ధరించాయి. అధిక బరువుతో బాధపడ్డ పిల్లాడే స్వర్ణ పతకంతో చరిత్ర సృష్టించాడు. చిన్నప్పటి కొన్ని అవమానాలు, కన్నీళ్లే కొందరు జీవితాలకు పునాదిరాళ్లవుతాయి. ఒక లక్ష్యం పెట్టుకుని ఆ దిశగా నూటికి నూరుశాతం కష్టపడితే ఏదైనా సాధ్యమేనని రుజువు చేశాడు. ఒలింపిక్స్ లో పోటీ పడటమే గొప్ప అనుకునే పరిస్థితి. అందులోనూ ఓ పతకం కోసమే శతాబ్దిగా నిరీక్షణ. మనవల్ల కాదనుకునే ఆలోచనకు చరమగీతం పాడించాడు చోప్రా!


రెండేళ్ల క్రితం కుడిచేతిని లేపలేని స్థితిలో ఉన్నవాడు, ఏడాది క్రితం మోచేతికి శస్త్ర చికిత్స చేయించుకున్నవాడు "నేను సాధించగలనా" అన్న ఆలోచన రానివ్వలేదు. సాధన కొనసాగించాడు. టోక్యో వైపునకు అడుగులేశాడు. స్వర్ణంతో తిరిగొచ్చాడు. నీరజ్ అథ్లెట్ మాత్రమే కాదు, భారత సైన్యం స్ఫూర్తి కూడా అతనిలో ఉంది. సైన్యంలో నాయిబ్ సుబేదార్ కూడా. వంట చేసి పెట్టే తల్లి, పంట సాగుచేసే తండ్రి. ఇదీ వ్యవసాయ కుటుంబ నేపథ్యం.

యావత్భారత దేశం సంభ్రమాశ్చర్యాలతో ఉప్పొంగేలా సింహంలా కదిలి కసిగా జావెలిన్ గాల్లోకి విసిరి స్వర్ణం చేజిక్కించుకుని కోట్ల స్వప్నాలను సాకారం చేసిన నీరజ్.. జయహో! విజయహో!! దేశభక్తి గీతంలోని ఈ పంక్తులు ఎప్పటికీ స్ఫూర్తి వాక్యాలే!

పదునాల్గు భువనాల నిన్నడ్డు మొనగాడు
లేడురా జగదేక వీరుడు నీవేరా! శివసముద్రమ్మువై బడబాగ్ని జ్వాలవై
లంఘించి దూకరా లోకాల నేలరా! విశ్వభారత వీర లేవోయీ!
ప్రగతి పథములవెంట పదవోయీ !!

# మాభూమి (నాటకం)

పుస్తకం




'మా భూమి' సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు కలిసి రచించిన సాంఘిక నాటకం. తెలంగాణాలోని నిజాం రాచరిక వ్యవస్థను ఈ నాటకం ప్రతిబింభిస్తుంది. మాభూమి నాటకంలో పాత్రలు రెండు పక్షాలకు చెందినవి.ఒకటి ప్రభుత్వ పక్షం, రెండవది ప్రజా పక్షం.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా తెలంగాణా ఇంకా నిజాం పీడిత ప్రాంతంగా దోపిడీదారుల కోరల్లో చిక్కి విలవిలలాడుతున్న రోజుల్లో కొద్దిపాటి సామాజిక దృష్టి కలిగిన ప్రతి తెలుగువాడు తెలంగాణా పట్ల సానుకూలంగా స్పందించాడు. నల్గొండ జిల్లాలో జరిగిన ప్రజా పోరాటాన్ని గురించి ఈ నాటకం వ్రాయబడింది. ఆ పోరాటంలో 240 గ్రామాలపై పోలీసు దాడులు జరిగాయి. 8,500 మంది అరెస్టు అయ్యారు. 15,390 మంది ప్రజలు హింసాకాండకు గురయ్యారు. 12 లక్షల 25 వేల రూపాయల విలువైన ఆస్తి ఆ రోజుల్లో దోపిడీ అయ్యింది. 52 మంది వీరులు ప్రాణాలు కోల్పోయారు. 64 మంది స్త్రీలను మానభంగం చేశారు. వారిలో ఇద్దరు మరణించారు. ఈ పోరాటమే మమ్మల్ని ఈ నాటకం రాయడానికి ప్రోత్సహించింది అని రచయితలు వ్రాసుకున్నారు. 1947 లో ఈ నాటకం అచ్చులో వెలువడింది.


ఆకాలంలో వెలువడిన రచనలలో ముఖ్య మైనది "మాభూమి" నాటకం. ఈ నాటకం ద్వారా సాటి తెలుగు ప్రజలు పరాయి పాలనలో పడుతున్న అవస్థల్ని సభ్య సమాజానికి పరిచయం చేసి ప్రచారం చేయడానికి ప్రముఖంగా తోడ్పడింది. ఆరోజుల్లో మాభూమి నిజాం ప్రభుత్వాన్ని ఒక కుదుపు కుదిపింది.

– అడబాల జగపతి.

# గిరిజన సంస్కృతిని పరిరక్షించుకుందాం

## సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి.వి.కట్టిమణి

**15.08.21 (మీడియాసెల్)** గిరిజన సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు అందరూ పాటుపడాలని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి.వి.కట్టిమణి అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం మరియు సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ విజయనగరం సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ట్రైబల్ డే సెలబ్రెషన్స్ – 2021 ను సోమవారం ఆన్ లైన్ ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి.వి.కట్టిమణి మాట్లాడుతూ గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. భూమిపై జీవిస్తున్న 80 కోట్ల జీవరాశులలో మానవుడు ఒక భాగం, అయినప్పటికి మానవుడు ఇతర జీవరాశుల మనుగడకు ఎక్కువ హాని చేకూర్చుతున్నాడని అన్నారు. గిరిజనుల సంస్కృతి ఎంతో ప్రత్యేకమైనదని, వారి కమ్యూనికేషన్, భాష, అలవాట్లు ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయని తెలిపారు. ఆధునిక మానవ జీవన విధానం కంటే గిరిజన జీవన విధానం ఎంతో మేలుకరంగా ఉంటుందని చెప్పారు. ప్రకృతినే దేవునిగా భావించి ప్రకృతి హితంగా, ప్రకృతి పరిరక్షణకు పాటుపడతారని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ పుట్టిన ప్రాంతంలోని సంస్కృతి, సంప్రదాయాలపై మక్కువను పెంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎస్సీ,ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ డా.పి.విజయనిర్మల, డా.డి.కళ్యాణి, డా.పి.వెంకటేశ్వరరావు, ఈసీ మెంబర్స్ ఆచార్య కె.శ్రీరమేష్, డా.బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్స్ డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.డి.జ్యోతిర్మయి, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ పరిపాలన అధికారి డా.ఎన్.వి.ఎస్.సూర్యనారాయణ, డా.వరహాలదొర, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య.టి.వి.కట్టిమణి

# ఎస్పీ, ఎమ్మెల్యేకు స్వాగతం పలికిన రిజిస్ట్రార్


ఎస్పీ, ఎమ్మెల్యే కు స్వాగతం పలికిన రిజిస్ట్రార్

**15.08.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో "దిశ –మహిళా రక్షణ" అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా పోలీస్ ఎస్పీ ఐశ్వర్య రాస్తోగి, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా లను రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను ఎమ్మెల్యేకు రిజిస్ట్రార్ వివరించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు పర్యవేక్షణలో కోవిడ్ సమయంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలను, ఐ.ఎస్.ఓ. సాధన, ఎ.ఐ.సి.టి.ఇ. సాధనలను గురించి ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ యాప్ ఆవిష్కరణకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వేదిక అయిందని, సి.ఎం. జగన్మోహనరెడ్డి, రాష్ట్ర పోలీసు అధికారులు మన యూనివర్సిటీలో దిశ యాప్ ను ఆవిష్కరిం చారని గుర్తు చేశారు. మరో సారి నన్నయ యూనివర్సిటీలో దిశ మహిళా రక్షణపై అవగాహన కల్పించడం హర్షణీయ మని, యూనివర్సిటీ అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ఎస్పీ గా ఐశ్వర్య రాస్తోగి బాధ్యతలు స్వీకరించిన తరువాత యూనివర్సిటీకి తొలిసారి రావడంతో రిజిస్ట్రార్‌తో పాటు అర్బన్ జిల్లా పోలీసు అధికారులు ఘన స్వాగతం పలికారు.


ఎమ్మెల్యేకి యూనివర్సిటీ అభివృద్ధిని వివరిస్తున్న రిజిస్ట్రార్



## మంచి మాట

ప్రయత్నాన్ని విరమించే వారు
విజేయులు కాలేరు
విజేయులు విరమించే
ప్రయత్నం చేయరు..



"స్వాతంత్ర్యం అందమైన పువ్వు!
చాలా వాడైనకత్తి!
విలువైన వజ్రం!!"
- శ్రీ శ్రీ (ఖడ్గసృష్టి)



## దేశానికి స్వాతంత్ర్యమొచ్చింది..




దేశానికి స్వాతంత్రమొచ్చింది
అందుకే, ఆగస్టు 15 పండుగ దినమైంది
పరశించిన పారవశ్యంతో
ఎందరో మహనీయులు చేసిన ప్రాణ త్యాగాలతో
సాధించిన ఈ స్వాతంత్ర్యం,
దేశాభివృద్ధిలో ఒక కీలక ఘట్టమవ్వాలి.
సహజ వనరులు పుష్కలంగా ఉన్నా..
యువ శక్తి అపారంగా ఉన్నా ..
ఉగ్గు పాలు పట్టి
ఓనమాలు నేర్పించిన
కన్న తల్లి వంటి భారతావనిని వదిలి
సంపాదనకు విదేశాలకు వలసపోతున్న
యువ శక్తి ఆగాలి.
'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయశి' సూత్రాన్ని స్మరించాలి.

మహాత్ముడు కలలు కన్న
గ్రామ స్వరాజ్యం కోసం
మహిళా స్వేచ్ఛ కోసం
పుంఖాను పుంఖాలుగా ప్రసంగాలు
ఇచ్చే నాయకులు, పాలకులు
75 ఏళ్ల అమృతోత్సవ చిహ్నంగా ఆచరణలోకి తీసుకురావాలి.
అప్పుడే కదా అభివృద్ధి అంటే...
ఇంతకంటే ఏమి కావాలి మనకు
దేశానికి స్వతంత్రం వచ్చిందనడానికి ...
అభివృద్ధిలో పయనిస్తున్నామనడానికి ..

గంధం మాచర వెంకటరమణ, రాజానగరం

## పుణ్యభూమి నా దేశం



నాదేశం చాలా గొప్పది
అందమైన పువ్వది!
దాన్ని సున్నితంగా చూద్దాం!
పుణ్యభూమి ఇది
నమోవాకాలు అర్పిద్దాం!

ఈ మతాలు కులాలు ఇంకానా?
మానవత్వం పంచుదాం!


నాదేశం చాలా గొప్పది!
ఎన్ని ఇచ్చిందో మనకు!
ఎన్ని తెచ్చిందో మనకు!
ఎంతో చరిత్ర ఉంది!
ఎంతో సంస్కృతి ఉంది!
వాటిని అర్థం చేసుకోవడంలోనే వెనకబడ్డాం!

ఎవరూ ఎవరికి తీసిపోరు!
ఎవరూ ఎవరికి బానిస కాదు!

నా దేశం చాలా గొప్పది!
సమసమాజ స్థాపనలో నేనూ భాగస్వామున్ని!
ఇది మనదేశం!
వందేమాతరం అందాం!
ప్రగతి బాటలో దూసుకుపోదాం!
నాదేశం చాలా గొప్పది!!


- డా.గూటం స్వామి


## మాతృ వందనం



దేవుని మారు రూపం అమ్మ.
గత జన్మ సుకృతం లభ్యం.
వేలాది నోములు కోట్లాది వ్రతాలు చేసినా
లభించని పుణ్య ఫలం.
అమ్మ గర్భంలో ఉన్నప్పుడు
ఎన్ని బాధలు తెలియక పెట్టామో!
పుట్టాక చిన్నతనపు చేష్టలతో
ఎంత గొడవ చేశామో!
అన్నీ తన కొడుకు చేస్తున్న
చిన్నతనపు చేష్టలని అమ్మ భావన.
సర్వం తెలిసాక కూడా అమ్మపై అరిచాము.
కోపం అసూయ తన సంతానం పై
ఎరుగని మమతల మూట అమ్మ.
తన పిల్లలు అభివృద్ధి అమ్మకు
ఆహారం ఆరోగ్యం.
అమ్మ దీవెన పొందని వారుండరు.
అమ్మ దేవుని మరో రూపం.
ఎన్ని జన్మలలోనైనా ఈ అమ్మే
మళ్లీ నా అమ్మగా జన్మించాలని.
ఈ అమ్మకే నేను సంతానం కావాలి.
అమ్మే బ్రహ్మ , బ్రహ్మే అమ్మ .
అమ్మా బ్రహ్మా ఇరువురూ అమ్మై మళ్ళీమళ్ళీ రావాలి.


–ఖండాపు మన్మథరావు,విజయవాడ.






భరతఖండంబు చక్కని
పాడియావు
హిందువులు లేగదూడలై
ఏడ్చుచుండ
తెల్లవారను గడుసరి
గొల్లవారు
పితుకుచున్నారు
మూతులు బిగియగట్టి

– చిలకమర్తి లక్ష్మీనరసింహం




దేశమును
ప్రేమించుమన్నా
మంచి అన్నది
పెంచుమన్నా
వట్టిమాటలు
కట్టి పెట్టోయ్
గట్టిమేల్
తలపెట్టవోయ్

– గురజాడ అప్పారావు




ఏ దేశమేగినా
ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా,
ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి
భారతిని
నిలుపరా నీజాతి
నిండుగౌరవము

– రాయప్రోలు సుబ్బారావు




వీరగంధము
తెచ్చినారము
వీరుడెవ్వడొ తెల్పుడీ!
పూసిపోదుము, మెడను
వైతుము పూలదండలు
భక్తితో!!

– త్రిపురనేని రామస్వామి



జయ జయ జయ
ప్రియభారత
జనయిత్రీ దివ్య ధాత్రి
జయ జయ జయ
శత సహస్ర
నరనారీ
హృదయ నేత్రి!

– దేవులపల్లి కృష్ణశాస్త్రి



మా కొద్దీ
తెల్లదొరతనము దేవ
మా ప్రాణాలపై పొంచి
మానాలు హరియించె...

– గరిమెళ్ళ సత్యనారాయణ

# ‘విహారం విషాదం కాకూడదు’



ఈ దారుణమైన సంఘటన మీకు గుర్తుండే ఉంటుంది. ఏడేళ్ళ క్రితం హైదరాబాద్ లోని ప్రఖ్యాత ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన దాదాపుగా 46 మంది విద్యార్థులు ఇండస్ట్రియల్ టూర్ కోసం హిమాచల్ ప్రదేశ్ లో 8-06-2014 సాయంత్రం 5:30 గంటలకు బియాస్ నదీ తీరాన ఫోటోలు తీసుకుందామని వెళ్లారు. అప్పుడు నదిలో నీళ్లు లేవు. కేవలం రాళ్లు మాత్రమే ఉన్నాయి. ఆ నది ప్రవహించే చోటున మధ్యలో ఒక పెద్ద బండరాయి వీళ్ళను ఆకర్షించింది. దానిపై నిలబడి, ఫోటోలు దిగుదామని వెళ్లారు. సరిగ్గా 6 గంటల సమయంలో ఒక సైరన్ మ్రోగింది.అదేంటో వీళ్లకు అర్థం కాలేదు. వీళ్ళున్న ప్రాంతానికి ముందు ఓ డామ్ గేట్లు ఎత్తివేసి, నదీ జలాలను విడుదల చేశారు. ఆ నదీ ప్రవాహం వీళ్ళ వైపుగా రావడాన్ని ఒడ్డున ఉన్న కొందరు చూశారు. వీళ్ళను హెచ్చరిస్తూ కేకలు వేశారు. కానీ, వీళ్ళు పట్టించుకోలేదు. ఆ నీళ్ళ మధ్యన నిలబడి, ఫోటోలు దిగుతూ ఉండిపోయారు. అంతలో నీటి మట్టం స్థాయి అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. ఒడ్డుకు దగ్గరలో ఉన్న ఇద్దరు అమ్మాయిలు గట్టు వైపునకు వచ్చేశారు.. అందులో ఒక అమ్మాయి తన చెప్పులు బండ మీద మర్చిపోయానని చెప్పుల కోసం మళ్ళీ నది మధ్యలోకి వచ్చేసింది. ఉన్నట్లుండి, నది ఉధృతంగా ప్రవహించడం మొదలుపెట్టింది. నీటి మట్టం ఎత్తు దాదాపుగా 5 అడుగుల వరకూ చేరుకుంది.. రాళ్ళ మీద నిలుచున్న విద్యార్థులు నిస్తేజంగా నిలబడిపోయారు. అందరూ చూస్తుండగానే నీటి ప్రవాహంలో కళ్లెదుటే కొట్టుకునిపోయారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారు.

ఇక్కడ మనం గమనించవలసింది:

టాప్ కాలేజ్ లో చదువుతున్న వీళ్లకు...

1)ప్రకృతి ఎంత శక్తివంతమైనది అని తెలియకపోవడం.

2)వీళ్ళలో ఎవరికీ ఈత రాకపోవడం.

3)'చెప్పుల' కోసం ప్రాణాలను పోగొట్టుకోవడం..

ఈ విషయాన్ని చదువుతున్నవారిలో ఎందరు పిల్లలకు ఈత వచ్చు?

ఈత అని మాత్రమే కాదు,

ఉన్నట్లుండి మీ ఇంట్లో Electrical short circuit ఏర్పడితే, ఏమి చెయ్యాలనేది ఎందరు పిల్లలకు తెలుసు?

ఎవరైనా పెద్దలకు heart attack, ఊపిరి ఆడకపోవడం, చెయ్యి తెగితే, రక్తం ధారగా కారుతున్నపుడు ఏమి చెయ్యాలి అన్నది ఎందరు పిల్లలకు తెలుసు? కనీసం FIRST AID ఎలా చేయాలో తెలుసా...?

ప్రకృతి అందాలే కాదు, ప్రకృతి కన్నెర్రజేస్తే, ఎలా ఉంటుందో వారికి తెలియాలి, చూపించాలి..

సమాజంలో తిరగడం అలవాటు చెయ్యాలి..

అన్నింటికంటే ముందు ‘common sense’ ఇంగిత జ్ఞానం, లౌక్యం అనేది లేకుండా,తెలియకుండా పిల్లలు పెరుగుతున్నారేమో గమనించాలి. చదువుకో, మార్కులు తెచ్చుకో, ర్యాంకులు సంపాదించు..అనడంతో పాటు లౌకికమైన పరిజ్ఞానం నేర్పడం ప్రస్తుత కర్తవ్యం.

ఈ విచారకర సంఘటన నేటి విద్యార్థులకు గుణపాఠం కూడా.

(పై సమాచారం వాట్స్ యాప్ నుండి....పిల్లలు,విద్యార్థుల మేలు కొరకు)



ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in